మహా పాదయాత్రను విజయవంతం చేయాలి

వెంకటాపూర్‌లో కరపత్రాలు పంచుతున్న మండలాధ్యక్షుడు లింగయ్య

మందమర్రి రూరల్, అక్టోబర్ 23 : ఎస్సీ వర్గీకరణను వ్యతిరేకిస్తూ 25 నుంచి డిసెంబర్ 1 వరకు రాష్ట్ర అధ్యక్షుడు పిల్లి సుధాకర్ నేతృత్వంలో నిర్వహించే మాలల మహా పాదయాత్రను జయప్రదం చేయాలని మాల మహానాడు సంఘం మండలాధ్యక్షుడు ఈద లింగయ్య పిలుపునిచ్చారు. వెంకటాపూర్, పొన్నారంలో బుధవారం ఇంటింటా తిరుగుతూ కరపత్రాలు పంపిణీ చేశారు. మండల ఉపాధ్యక్షుడు గడ్డం శ్రీనివాస్, కోశాధికారి శంకర్, వెంకటేశ్, స్వామి, శంకర్, కిరణ్, లింగయ్య, రాజేశ్, రామకృష్ణ, బానయ్య, భీమయ్య, వెంకటేశం, హరికృష్ణ, సాయికుమార్ పాల్గొన్నారు.

సకాలంలో సరుకులు పంపిణీ చేయాలి

నస్పూర్, అక్టోబర్ 23 : జిల్లాలోని రేషన్ దుకాణాల ద్వారా అర్హులైన లబ్ధిదారులకు సకాలంలో రేషన్ సరుకులు పంపిణీ చేయాలని డీలర్లకు మంచిర్యాల అదనపు కలెక్టర్ మోతీలాల్ సూచించారు. కలెక్టరేట్‌లో బుధవారం రేషన్ డీలర్లతో సమావేశం నిర్వహించారు. రేషన్ దుకాణంలో సరుకులు, నిల్వలు, ధరల వివరాలను ప్రదర్శించాలని, షాపు నంబర్, మొబైల్ నంబర్ నోటీసు బోర్డులో ఉంచాలన్నారు. జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి బ్రహ్మారావు, జిల్లా మేనేజర్ శ్రీకళ, ఏఎస్‌వో వేణు పాల్గొన్నారు.

ప్రభాస్ జన్మదిన వేడుకలు

మంచిర్యాల అర్బన్/ఆసిఫాబాద్ టౌన్/కెరమెరి, అక్టోబర్ 23 : హీరో ప్రభాస్ జన్మదిన వేడుకలను బుధవారం మంచిర్యాల, కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లా కేంద్రాల్లో, కెరమెరి మండల కేంద్రంలో అభిమానులు ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేశారు. ఆలయాల్లో పూజలు చేశారు. మంచిర్యాలలో ఫ్యాన్స్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎండీ రజాక్ ఆధ్వర్యంలో ఐబీ చౌరస్తాలో భారీ కటౌట్ ఏర్పాటు చేశారు. మహా అన్నదానం ఏర్పాటు చేశారు. ఇక్కడ జిల్లా ప్రధాన కార్యదర్శి ఇప్ప సురేశ్, జిల్లా కోశాధికారి తుల శ్రీకాంత్, గౌరవ అధ్యక్షుడు అశ్విన్ సోహెల్, నరేశ్, శివ, శ్రీను, ప్రశాంత్, శ్రీధర్, ఎండీ నబియాస్, కోటేశ్, మోహన్, గౌస్, ప్రశాంత్, అజయ్.. ఆసిఫాబాద్‌లో జిల్లా అధ్యక్షుడు వాడై జనార్దన్, ఉపాధ్యక్షుడు నగేశ్, మండలాధ్యక్షుడు శ్రీ కాంత్, సభ్యులు సాయికిరణ్, గోపాల్, మధు.., కెరమెరిలో మండలాధ్యక్షుడు రాహుల్, ఉపాధ్యక్షుడు శ్రీనివాస్, సభ్యులు శ్రీకాంత్, శేఖర్, పరమేశ్వర్, పవన్ తదితరులు పాల్గొన్నారు.

విజయవంతం చేయండి

నస్పూర్/ఆసిఫాబాద్ టౌన్, అక్టోబర్ 23 : ఉమ్మడి జిల్లా కేంద్రాల్లో కుల సమగ్ర సర్వేపై అన్నికులాల ప్రతినిధులు, అధికారులతో నిర్వహించే సదస్సులకు పూర్తిస్థాయి ఏర్పాట్లు చేసి, విజయవంతం చేసేలా కృషి చేయాలని రాష్ట్ర వెనుకబడిన తరగతుల కమిషన్ చైర్మన్ నిరంజన్‌గౌడ్ పేర్కొన్నారు. హైదరాబాద్‌లోని వెనుకబడిన తరగతుల కమిషన్ కార్యాలయం నుంచి బుధవారం కమిటీ సభ్యులు రాపోలు జయప్రకాశ్, తిరుమలగిరి సురేందర్, బాల లక్ష్మి రంగు, సభ్య కార్యదర్శి బాల మాయాదేవితో కలిసి జూమ్ మీటింగ్ ద్వారా అన్ని జిల్లాల కలెక్టర్లు, అదనపు కలెక్టర్లు, వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. మంచిర్యాల కలెక్టర్ కుమార్ దీపక్ మాట్లడుతూ.. సదస్సుకు అన్ని కులాల ప్రతినిధులు, స్వచ్ఛంద సంస్థల సభ్యులు, ప్రజాప్రతినిధులు హాజరయ్యేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఆసిఫాబాద్ కలెక్టరేట్‌లో అదనపు కలెక్టర్లు దీపక్ తివారి, దాసరి వేణు, కాగజ్‌నగర్ సబ్ కలెక్టర్ శ్రద్ధా శుక్లా, ఆసిఫాబాద్ రాజస్వ మండల అధికారి లోకేశ్వర్ రావు, జడ్పీసీఈవో లక్ష్మీనారాయణ, డీపీవో భిక్షపతి గౌడ్, జిల్లా సంక్షేమ అధికారి సజీవన్ హాజరయ్యారు.

ఎల్ ఆర్ ఎస్ సర్వే త్వరగా పూర్తిచేయాలి

కెరమెరి : హట్టి శివారులో సర్వే వివరాలను పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ దీపక్ తివారి

కెరమెరి, అక్టోబర్ 23 : ఎల్ఆర్ఎస్ సర్వే ప్రక్రియను అధికారులు, సిబ్బంది సమన్వయంతో త్వరగా పూర్తిచేయాలని కుమ్రం భీం ఆసిఫాబాద్ అదనపు కలెక్టర్ దీపక్ తివారీ ఆదేశించారు. కెరమెరి మండలం హట్టి గ్రామ పరిధిలో నిర్వహిస్తున్న సర్వే ప్రక్రియను బుధవారం ఆయన పరిశీలించారు. దరఖాస్తులను రికార్డులతో పరిశీలించి, సదరు ప్లాట్ల భౌగోళిక స్థితి ఆధారంగా ప్రక్రియ వేగవంతం చేయాలని, ప్రతి దరఖాస్తును క్షేత్రస్థాయిలో పరిశీలించాలని సూచించారు. అధికారులు, సిబ్బంది క్షేత్రస్థాయికి వెళ్లి, దరఖాస్తుదారుడికి సమాచారం అందించి డాక్యుమెంట్లను పరిశీలించాలని తెలిపారు. అనంతరం మండల కేంద్రంలోని అంగన్‌వాడీ కేంద్రం-2ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. రిజిష్టర్, వంట సామగ్రి నిల్వలు, పరిసరాలను సమీక్షించారు. అంగన్‌వాడీ కేంద్రం ఆధునీకరణ చేస్తున్నందున తగు ఏర్పాట్లు చేయాలన్నారు. ఆ తర్వాత జడ్పీ ఉన్నత పాఠశాలను సందర్శించి, అమ్మ ఆదర్శ పాఠశాలల కమిటీ ఆధ్వర్యంలో జరుగుతున్న అభివృద్ధి పనుల పురోగతిపై ఇంజినీరింగ్ అధికారులను అడిగి తెలుసుకున్నారు. డిప్యూటీ తహసీల్దార్ గోడం సంతోష్ కుమార్, ఎంపీడీవో మహ్మద్ అజ్జద్‌పాషా, ఎంఈవో ప్రకాశ్, రెవెన్యూ గిర్దావార్ పవన్ నాయక్, సర్వేయర్ రమేశ్, గిరిజన సంక్షేమ శాఖ ఏఈ నజీముద్దీన్, కార్యదర్శులు, ఐసీడీఎస్ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రణాళిక రూపొందించాలి..

ఆసిఫాబాద్ అంబేద్కర్ చౌక్, అక్టోబర్ 23 : కాగజ్‌నగర్ మున్సిపల్ అభివృద్ధికి ప్రణాళిక రూపొందించాలని అదనపు కలెక్టర్ అధికారులకు సూచించారు. అమృత్ 2.0 కింద కాగజ్‌నగర్ మున్సిపాలిటీ ఎంపికైనందున అభివృద్ధికి చేపట్టవలసిన పనులపై కలెక్టరేట్‌లో రెవెన్యూ, విద్యుత్, రోడ్లు భవనాలు, నీటిపారుదల, ఆర్టీసీ, మెప్మా, రవాణా, వెటర్నరీ, వైద్య ఆరోగ్య, మార్కెటింగ్, పర్యాటక, అటవీ, అగ్నిమాపక, మైనింగ్, పరిశ్రమల శాఖల అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ప్రస్తుతం కొనసాగుతున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి పనులతో పాటు వచ్చే 20 ఏళ్లకు చేపట్టే పనులపై ప్రణాళిక రూపొందించాలని అధికారులను ఆదేశించారు. 31వ తేదీలోగా మున్సిపల్ కమిషనర్‌కు అందించాలని తెలిపారు. జీఏఎస్ డ్రోన్ సిస్టం ద్వారా మున్సిపాలిటీని చిత్రించనున్నట్లు తెలిపారు.

పేదలకు తమవంతు సాయం అందిస్తాం

విద్యార్థులకు ప్లేట్లు, గ్లాసులు అందిస్తున్న సిస్టర్ షారోన్

కాసిపేట, అక్టోబర్ 23 : పేద విద్యార్థులకు సౌకర్యాలు కల్పించేందుకు కల్వరీ మినిస్ట్రీస్ ప్రవీణ్, షారోన్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో తమ వంతు సహాయ సహకారాలు అందిస్తామని ఫౌండేషన్ చైర్మన్ సిస్టర్ షారోన్ స్పష్టం చేశారు. బెల్లంపల్లి-సోమగూడెం రహదారి మధ్యలోని కల్వరీ మినిస్ట్రీస్ ఫౌండేషన్ చైర్మన్ సిస్టర్ షారోన్ జన్మదినం సందర్భంగా కాసిపేట కేజీబీవీలో బుధవారం విద్యార్థినులకు రూ.50వేల విలువ గల 186 భోజన ప్లేట్లు, 186 గ్లాసులు, నాలుగు ఫ్యాన్లను స్థానిక నాయకులు, అధికారులతో కలిసి అందించారు. సిస్టర్ షారోన్ మాట్లాడుతూ.. కాసిపేటలోని అనేక గ్రామాల్లో పేదలకు, మారుమూల గ్రామాల విద్యార్థుల చదువు కోసం తమ వంతుగా సేవా కార్యక్రమాలు చేపట్టామని వివరించారు. అనంతరం కేక్ కట్ చేసి, సిస్టర్ షారోన్‌ను సన్మానించారు. మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ కారుకూరి రాంచందర్, మాజీ జడ్పీటీసీ రౌత్ సత్తయ్య, తహసీల్దార్ భోజన్న, నాయకులు దూడం మహేశ్, ముత్తినేని రవి కుమార్, సిద్ధం తిరుపతి, దుర్గం గోపాల్, గోలేటి స్వామి, ప్రిన్సిపాల్ సరిత, కల్వరీ మినిస్ట్రీస్ ఫౌండేషన్ నిర్వాహకులు శ్రీనివాస్, స్థానిక నాయకులు, అధికారులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి

మాట్లాడుతున్న ఎమ్మెల్సీ అభ్యర్థి వంగ మహేందర్ రెడ్డి

మందమర్రి, అక్టోబర్ 23 : ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి కృషిచేస్తానని పీఆర్టీయూ టీఎస్ ఎమ్మెల్సీ అభ్యర్థి వంగ మహేందర్ రెడ్డి పేర్కొన్నారు. పట్టణంలోని శ్రీకన్వెన్సన్ హాలులో బుధవారం నిర్వహించిన ఎన్నికల సన్నాహక సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో అధిక సంఖ్యలో 90 వేల సభ్యత్వాలు కలిగిన పటిష్టమైన ఉపాధ్యాయ సంఘం పీఆర్టీయూ టీఎస్ అని పేర్కొన్నారు. రానున్న రోజుల్లో ఉపాధ్యాయుల పెండింగ్ డీఏలను ఇప్పించడంతో పాటు, 50 శాతం ఫిట్‌మెంట్ సాధిస్తామని, ఉపాధ్యాయ, ఉద్యోగ, కార్మికులను ఆందోళనకు గురిచేస్తున్న సీపీఎస్‌ను రద్దు చేయించి, ఓపీఎస్‌ను పునరుద్ధరించే దిశగా సంఘం కృషి చేస్తున్నదని వివరించారు. వంద శాతం ఓటరు నమోదుకు కృషి చేయాలని ఉపాధ్యాయులకు సూచించారు. పీఆర్టీయూ జిల్లా అధ్యక్షుడు టీ ఇన్నారెడ్డి, ప్రధాన కార్యదర్శి రాసపల్లి రవి, అన్ని మండలాల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు, జిల్లా, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

ఖాదీ మేళా సద్వినియోగం చేసుకోండి


రెబ్బెన : ఖాదీ వస్త్రాలను పరిశీలిస్తున్న బెల్లంపల్లి ఏరియా జీఎం శ్రీనివాస్

రెబ్బెన, అక్టోబర్ 23 : బెల్లంపల్లి ఏరియాలోని గోలేటి సీఈఆర్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన ఖాదీ మేళాను పరిసర ప్రాంతాల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని జీఎం ఎం శ్రీనివాస్ పేర్కొన్నారు. గోలేటి సీఈఆర్ క్లబ్‌లో వావిలాల ఖాదీ గ్రామోద్యోగ్ ప్రతిస్తాన్ (జమ్మికుంట) ఏర్పాటు చేసిన ఖాదీ మేళా స్టాల్‌ను బుధవారం ఆయన ముఖ్యఅతిథిగా హాజరై, ప్రారంభించారు. వస్త్రాల కొనుగోలుపై 25 నుంచి 40 శాతం వరకు రాయితీ ఉందని, 29వ తేదీ వరకు మేళా ఉంటుందన్నారు. రూ.20 వేల వరకు వస్త్రాలు క్రెడిట్‌పై అందించడం జరుగుతుందని, 5 వాయిదాల చెల్లింపు అవకాశం ఉందని నిర్వాహకులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఏరియా ఎస్‌వోటూ జీఎం రాజమల్లు, పర్సనల్ మేనేజర్ రెడ్డిమల్ల తిరుపతి, నిర్వాహకులు చంద్రమౌళి, సతీశ్ తదితరులు పాల్గొన్నారు.

జీఎం కార్యాలయంలో స్వచ్ఛతా పఖ్వాడ..

గోలేటి జీఎం కార్యాలయంలో స్వచ్ఛతా పఖ్వాడ (స్పెషల్ కాంపెయిన్ 4.0) కార్యక్రమంలో భాగంగా పరిసరాలను శుభ్రం చేశారు. పిచ్చి మొక్కలు తొలగించారు. జీఎం శ్రీనివాస్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఇక్కడ ఏరియా ఇంజనీర్ భీంరావ్‌జాడే, డీజీఎం(ఐఈడీ) ఉజ్వల్ కుమార్ బెహరా, ఏరియా సర్వే అధికారి చంద్రశేఖర్, సివిల్(ఎస్ఈ) మదీనా బాషా, ఫైనాన్స్ మేనేజర్ రవికుమార్, ఎన్విరాన్‌మెంట్ అధికారి రమేశ్, ఐటీ ఇన్‌చార్జి ముజీబ్ తదితరులు పాల్గొన్నారు.

మందమర్రిలో ఖాదీ మేళా..

మందమర్రి, అక్టోబర్ 23 : దీపావళి పండుగ సందర్భంగా మందమర్రి పట్టణంలోని సింగరేణి సీఈఆర్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన ఖాదీ మేళాను జీఎం రాజేశ్వర్‌రెడ్డి ప్రారంభించారు. కార్మికులు, వారి కుటుంబాలు, పట్టణ ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏరియా పర్సనల్ మేనేజర్ ఎస్ శ్యాంసుందర్, క్లబ్ కార్యదర్శి సామంతుల స్వామి తదితరులు పాల్గొన్నారు.

నేడు ఎస్‌జీఎఫ్ క్రికెట్ పోటీల ఎంపిక

బెల్లంపల్లి, అక్టోబర్ 23 : ఉమ్మడి జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ అండర్-19 ఆధ్వర్యంలో మంచిర్యాల జడ్పీ బాలుర పాఠశాలలో గురువారం మంచిర్యాల, ఆసిఫాబాద్ జిల్లాల స్థాయి క్రికెట్ క్రీడాకారుల ఎంపిక పోటీలు నిర్వహిస్తున్నట్లు ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యదర్శి బీ బాబురావు తెలిపారు. ఇంటర్మీడియట్ చదువుతూ, 19 ఏళ్లలోపు వారు అర్హులని పేర్కొన్నారు. ఆసక్తి గల విద్యార్థులు బోనఫైడ్, ఆధార్‌కార్డు తీసుకుని రావాలని సూచించారు. అదే రోజు ఉదయం 9 గంటలకు పీడీ రాజయ్య, ప్రదీప్ క్రికెట్ కోచ్ 94401 41328, 94400 10696 నంబర్లను సంప్రదించాలని వెల్లడించారు.

భూ దాతకు సన్మానం

వాంకిడి, అక్టోబర్ 23 : సడక్ గూడ గ్రామంలో మల్టీపర్పస్ సెంటర్ నిర్మాణానికి ఐదు గుంటల భూమి దానం చేసిన రాథోడ్ గులాబ్‌కు గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు. బుధవారం ఘనంగా సన్మానించారు. గులాబ్ తన భూమిని మల్టీపర్పస్ సెంటర్‌కు దానం చేయడం అభినందనీయమని చైపన్ గూడ మాజీ సర్పంచ్ సిడాం అన్నీగా పేర్కొన్నారు. గ్రామస్తులు సిడాం భీము, ఆత్రం భగవంత్‌రావ్, సిడాం మారు, ఆత్రం భీము, రాథోడ్ ప్రభు గ్రామస్తులు పాల్గొన్నారు.

స్కూల్ ఇన్నోవేషన్‌లో పాల్గొనాలి

నస్పూర్, అక్టోబర్ 24 : స్కూల్ ఇన్నోవేషన్ మారథాన్-2024లో జిల్లాలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల విద్యార్థులు పాల్గొనేలా ఎంఈవోలు, ప్రధానోపాధ్యాయులు కృషిచేయాలని మంచిర్యాల డీఈవో యాదయ్య బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. 6 నుంచి 12వ తరగతుల విద్యార్థులు అర్హులని పేర్కొన్నారు. రిజిస్ట్రేషన్, కోర్స్ ప్రొటో టైపింగ్ సమర్పణ నమోదు చేసేందుకు విద్యార్థులు ఉపాధ్యాయుల సహకారం తీసుకోవాలని, నవంబర్ 30లోగా పూర్తి చేయాలని తెలిపారు. జిల్లా సైన్స్ అధికారిని సంప్రదించాలని సూచించారు.

దేశీదారు పట్టివేత

కాగజ్‌నగర్, అక్టోబర్ 23 : మహారాష్ట్ర నుంచి కాగజ్‌నగర్‌కు అక్రమంగా తరలిస్తున్న దేశీదారును బుధవారం పట్టుకున్నట్లు కాగజ్‌నగర్ ఎక్సైజ్ సీఐ రవి తెలిపారు. నమ్మదగిన సమాచారం మేరకు మహారాష్ట్రలోని వీరూర్ గ్రామం నుంచి కాగజ్‌నగర్‌కు అక్రమంగా తరలిస్తున్న 200 దేశీదారు సీసాలను కాగజ్‌నగర్ రైల్వే స్టేషన్ సమీపంలో పట్టుకున్నట్లు వెల్లడించారు. ఈ మేరకు రతన్‌లాల్‌పై కేసు నమోదు చేసి, వాహనం సీజ్ చేసినట్లు తెలిపారు. దాని విలువ రూ.8వేలు ఉంటుందన్నారు. ఎక్సైజ్ ఎస్ఐ రాజ్‌కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

కరపత్రాల విడుదల

జైనూర్, అక్టోబర్ 23 : మండలంలోని పట్నాపూర్ రస్తాలో ఏర్పాటు చేసిన కుమ్రం భీం విగ్రహ ఆవిష్కరణకు సంబంధించిన కరపత్రాలు, పోస్టర్లను బుధవారం జైనూర్‌లో గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ కనక యాదవరావు, నాయకులు విడుదల చేశారు. ఆదివాసీ నాయకులు మెస్రం అంబాజీరావ్, పేందూరు లచ్చు, మేస్రం దౌలత్‌రావ్, తుకారం చాహకటి గణేశ్, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

జాతీయస్థాయి పోటీలకు ఎంపిక

నస్పూర్, అక్టోబర్ 23 : అస్సాంలో 25 నుంచి 30వ తేదీ వరకు జరుగనున్న అండర్-13 జాతీయస్థాయి బ్యాడ్మింటన్ ర్యాంకింగ్ మెయిన్ డ్రా పోటీలకు మంచిర్యాల జిల్లా క్రీడాకారిణి ఆరాధ్య డబుల్స్ విభాగంలో ఎంపికైనట్లు జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి పుల్లూరి సుధాకర్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. కోల్‌కతా, జార్ఖండ్‌లో గత నెలలో జరిగిన పోటీల్లో ప్రతిభ చూపినట్లు తెఇపారు. ఆమెను అసోసియేషన్ సభ్యులు అభినందించారు.

బెటాలియన్‌లో రక్తదాన శిబిరం

హాజీపూర్, అక్టోబర్ 23 : తెలంగాణ అమరవీరుల వారోత్సవాల సందర్భంగా గుడిపేటలోని 13వ ప్రత్యేక తెలంగాణ పోలీస్ బెటాలియన్‌లో రక్తదాన శిబిరం నిర్వహించారు. విధి నిర్వాహణలో పోలీసుల త్యాగాలు మరువలేనివని కమాండెంట్ వెంకట్రాములు తెలిపారు. అసిస్టెంట్ కమాండెంట్లు కాళిదాసు, యూనిట్ మెడికల్ ఆఫీసర్ సంతోష్ సింగ్, ఆర్ఐలు, పోలీస్ అధికారులు, సిబ్బంది, ట్రైనీ కానిస్టేబుళ్లు పాల్గొన్నారు.

జూమ్ మీటింగ్‌లో సీనియర్ సిటిజన్లు

కాగజ్‌నగర్, అక్టోబర్ 23 : తెలంగాణ ఆల్ సీనియర్ సిటిజన్స్ రాష్ట్ర అధ్యక్షుడు పీ నర్సింహారావు ఆధ్వర్యంలో బుధవారం జూమ్ మీటింగ్ నిర్వహించారు. ఆసిఫాబాద్ జిల్లా కాగజ్‌నగర్ సీనియర్ సిటిజన్లు మూర్తి, నారాయణ, రమణయ్య, కోటేశ్వర, చిలుక లక్ష్మీనారాయణ, నాగేశ్వర్‌రావు, రాష్ట్ర కార్యదర్శి సత్యనారాయణ పాల్గొన్నారు. వయోధికుల పలు సమస్యలపై చర్చించారు. వయోధికులపై వేధింపు, చర్యలపై ఎప్పటికప్పుడు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని, వెంటనే పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని కోరినట్లు వారు స్పష్టం చేశారు.

ప్రభుత్వ భూముల సర్వే

పెంచికల్‌పేట్, అక్టోబర్ 23 : పెంచికల్‌పేట్ మండలం ఎల్కపల్లిలోని సర్వే నంబర్ 61లో గల ప్రభుత్వ భూముల్లో తహసీల్దార్ వెంకటేశ్వర్‌రావు ఆధ్వర్యంలో ఇరిగేషన్ డీఈ భద్రయ్యతో కలిసి సర్వే చేపట్టారు. భూమిని ఆక్రమించారని పలువురు ఫిర్యాదు చేయగా, సర్వే నంబర్ 61, బొక్కి వాగు ప్రాజెక్ట్ శిఖం భూములకు హద్దులు గుర్తించారు. నివేదికను అధికారులకు అందిస్తామన్నారు.

చీఫ్ కన్జర్వేటర్‌కు వినతి

దండేపల్లి,(జన్నారం) అక్టోబర్ 23 : ఖానాపూర్ నియోజకవర్గంలోని కవ్వాల్ టైగర్ జోన్ పరిధిలో గల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ తెలంగాణ చీఫ్ కన్జర్వేటర్‌కు ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు వినతిపత్రం అందించారు. భారీ వాహనాలకు అనుమతి లేకపోవడం, ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను వివరించారు. భారీ వాహనాలకు అనుమతి లేక జన్నారం, కడెం, దస్తురాబాద్, ఇంద్రవెల్లి, ఉట్నూర్ మండలాల్లో అభివృద్ధి ఆగిపోయిందన్నారు. ఆయన వెంట సీనియర్ నాయకులు మిక్కిలినేని రాజశేఖర్, సయ్యద్ ఇసాక్ ఉన్నారు.

ఐఎన్టీయూసీ నాయకుల మధ్య ఘర్షణ

సీసీసీ నస్పూర్, అక్టోబర్ 23 : ఐఎన్టీయూసీ నాయకుల మధ్య బుధవారం సాయంత్రం ఘర్షణ చోటుచేసుకున్నది. నస్పూర్‌కాలనీలోని యూనియన్ కార్యాలయంలో ఐఎన్టీయుసీ నాయకులు శ్రీరాంపూర్ ఏరియా ఎస్సార్పీ-1 గనికి చెందిన వెంకటేశ్, ఎస్సార్పీ-3కి చెందిన మనోజ్ మధ్య మాటామాటా పెరిగి కొట్టుకున్నారు. నాయకులు సముదాయించారు. ఆధిపత్యమే ఈ దాడికి కారణమని తెలుస్తున్నది. ఈ మేరకు మనోజ్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు విచారణ చేపడుతామని ఎస్ఐ సుగుణాకర్ తెలిపారు.

కొవ్వొత్తుల ర్యాలీ

రెబ్బెన, అక్టోబర్ 23 : పోలీసు అమరవీరుల సంస్మరణ దినం సందర్భంగా రెబ్బెన పోలీసుల ఆధ్వర్యంలో కొవ్వొత్తుల ర్యాలీ తీసినట్లు ఎస్ఐ చంద్రశేఖర్ తెలిపారు. అంతర్రాష్ట్ర రహదారిపై ర్యాలీ తీసి, నివాళులర్పించినట్లు పేర్కొన్నారు. మండలంలోని మాజీ ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.

పెంచికల్‌పేట్, అక్టోబర్ 23 : పెంచికల్‌పేట్ ఎస్ఐ కొమురయ్య ఆధ్వర్యంలో కొవ్వొత్తుల ర్యాలీ తీశారు. పోలీసు అమరులకు నివాళులర్పించారు. యువకులు, పోలీసులున్నారు.

సోషల్ మీడియాలో పోస్టులు పెట్టిన వ్యక్తిపై కేసు

బెల్లంపల్లి, అక్టోబర్ 23 : ఇద్దరి మధ్య జరిగిన గొడవను తప్పుడు సమాచారంతో ఎక్స్ (ట్విట్టర్)లో అప్‌లోడ్ చేసిన యూట్యూబర్ చిలుక ప్రవీణ్‌పై బుధవారం తాళ్లగురిజాల పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదు చేసినట్లు ఏసీపీ రవికుమార్ తెలిపారు. బట్వాన్‌పల్లి గ్రామానికి చెందిన సింగతి నరేందర్, సింగతి మల్లేశం భూతగాదాతో ఒకరినొకరు కొట్టుకొని 15న పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసుకున్నారు. ఇరువురిపై పోలీసులు కేసు నమోదు చేశారు. గొడవకు సంబంధించిన ఫొటోలను నరేందర్ యూట్యూబ్, ఫేస్‌బుక్‌లో అప్‌లోడ్ చేశాడు. ప్రవీణ్ అనే యూట్యూబర్ ఆ సంఘటనను వక్రీకరించి, రెండు వర్గాల మధ్య, రెండు రాజకీయ పార్టీల నడుమ విద్వేషాలు పెంచేలా ఎక్స్ (ట్విట్టర్)లో పోస్టు చేశాడు. దీంతో ప్రవీణ్‌పై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఏసీపీ వెల్లడించారు.

BEFORE THE HON'BLE TELANGANA STATE CONSUMER DISPUTES REDRESSAL COMMISSION: AT HYDERABAD
F.A.No. 124 of 2024
Against
C.C.No.12 of 2021

BETWEEN:
1. Jasper Industries Pvt. Ltd., Represented by its Authorised Signatory C/o. H.No. 1-219/2, S.No. 273, Black No. 1, FCI Opposite, Maruti Nagar, Dist. Mancherial-504 208.
2. Jasper Industries Private Limited, Represented by its Authorized Signatory, C/o. H.No. 8-6-326/2/B, Ujwala-Park Road, Near NTR Statue, Karimnagar, Dist. Karimnagar-505 001.
3. Jasper Industries Private Limited, Represented by authorized signatory, C/o. H.No. 5-10-173, Vasanta Chambers, Basheerbagh, Hyderabad.

...Appellants/ Opposite Parties

And

Metuku Mahender, S/o. Rajaiah, Age: 35 Yrs., Occ: Business, R/o. H.No. 4-67, Dubbuguda, Goleti, Rebbena, Dist. Komrambheem Asifabad-504 293.

...Respondent/Complainant

To
Metuku Mahender, S/o. Rajaiah, Age: 35 Yrs., Occ: Business, R/o. H.No. 4-67, Dubbuguda, Goleti, Rebbena, Dist. Komrambheem Asifabad-504 293.

Please take notice that the Appellants herein filed F.A.No. 124 of 2024 on file of Hon'ble Telangana State Commission, Hyderabad against the Order Dated 29-07-2015 passed in C.C.No. 12 of 2021, on the file of Hon'ble District Consumer Disputes Redressal Commission, Adilabad. The matter has been posted to 06-11-2024 for your appearance.

Kindly cause appearance in F.A.No. 124 of 2024 before the Hon'ble Telangana State Consumer Disputes Redressal Commission, Eruvaka, Anand Nagar Colony Road, Khairtabad, Hyderabad, Telangana-500 004 either in person or through an Advocate at 10.30 a.m. on 06-11-2024, failing which the matter will be determined in your absence.

// By Order //
Indus Law Firm
Sd/- V.R.N.PRASHANTH, Advocate
Address: 6-3-522-535, Villa No. 7, Pavani Villas, Dwarakapuri Colony, Panjagutta, Hyderabad-500 082,
Mob: +91 7757996405,
Mail: induslawfirm.advocates@gmail.com

అమ్మ ఆదర్శ పాఠశాల నిధుల గోల్ మాల్

● కాంగ్రెస్ సీనియర్ నాయకుడు రాజాగౌడ్

చెన్నూర్ రూరల్, అక్టోబర్ 23 : చెన్నూర్ మండలం కొమ్మెర జడ్పీ సెకండరీ పాఠశాల మరమ్మతులకు అమ్మ ఆదర్శ పాఠశాల పథకం కింద మంజూరైన నిధులు గోల్‌మాల్ అయ్యాయని కొమ్మెర మాజీ ఎంపీటీసీ, సీనియర్ కాంగ్రెస్ నాయకుడు కాళేశ్వరం రాజాగౌడ్ ఆరోపించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పాఠశాల మరమ్మతులకు ప్రభుత్వం నుంచి రూ.2 లక్షలు మంజూరయ్యాయన్నారు. అయితే గ్రామపంచాయతీ తీర్మానం చేసి వీవో (విలేజ్ ఆర్గనైజర్)కు అప్పగించి, మరమ్మతులు చేపట్టాల్సి ఉందని తెలిపారు. కానీ, తీర్మానం చేసిన మహిళకు కాకుండా ప్రధానోపాధ్యాయుడు ప్రకాశ్‌రెడ్డి ఇతరులకు రూ.1.60 లక్షలను మరమ్మతుల పేరిట అప్పగించారని ఆరోపించారు. తీసుకున్న నిధులతో నిర్లక్ష్యపు పనులు చేపట్టి, 30 శాతం పనులు కూడా చేయలేదని విమర్శించారు. అందులోనూ నాణ్యత లోపించిందన్నారు. సంబంధిత అధికారులు పనులను పరిశీలించి, నిధుల ఖర్చుపై విచారణ చేపట్టాలని డిమాండ్ చేశాడు. ఈ విషయంపై ప్రధానోపాధ్యాయుడు ప్రతాప్ రెడ్డిని వివరణ కోరగా.. అమ్మ ఆదర్శ పాఠశాల పథకం కింద రూ.2 లక్షలు మంజూరయ్యాయని తెలిపారు. మరమ్మతుల కోసం రూ.1.60 లక్షలు అప్పగించినట్లు చెప్పారు. అప్పటి నుంచి కాంట్రాక్ట్ తీసుకున్నవారు సక్రమంగ అందుబాటులో లేకపోవడంతో తన వద్ద మిగిలిన నిధులు రూ.38 వేలతో గదుల్లో విద్యుత్ సంబంధిత పనులు చేయించినట్లు వివరించారు.

మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందాలి

జైపూర్, అక్టోబర్ 23 : స్వయం సహాయక సంఘాల ద్వారా మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందాలని డీఆర్డీవో కిషన్ పేర్కొన్నారు. మండల కేంద్రంలోని మహిళా సమాఖ్య భవన్‌లో బుధవారం మహిళా సంఘాలతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. గ్రామాల్లో ఉన్న సఘాలన్నీ ఏ గ్రేడ్‌లో ఉండాలని తెలిపారు. చిన్న, పెద్ద సంఘాలు సమావేశాలు నిర్వహించి, ప్రభుత్వం అందిస్తున్న పథకాలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. రుణాలు తీసుకొని ఆర్థికాభివృద్ధి ప్రణాళికలు వేసుకోవాలని తెలిపారు. ఏపీఎం రాజ్‌కుమార్, సీసీ దినేష్‌తో పాటు, మహిళా సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

కేజీబీవీ సందర్శన

చింతలమానేపల్లి, అక్టోబర్ 23 : మండల కేంద్రంలోని కేజీబీవీ పాఠశాలలను బుధవారం మండల ప్రత్యేకాధికారి శ్రీనివాసరావు అధికారులతో కలిసి సందర్శించారు. పదోతరగతి విద్యార్థుల నైపుణ్యం గురించి ఉపాధ్యాయులను అడిగి తెలుసుకున్నారు. పాఠశాల ఆవరణ, వంటగది, భోజనశాలను పరిశీలించారు. ప్రహరీ, ఆట స్థలం కావాలని ఉపాధ్యాయులు, విద్యార్థులు ఆయన దృష్టికి తీసుకెళ్లారు. ఎంపీడీవో కోట ప్రసాద్, ఎంపీవో సుధాకర్ రెడ్డి, కార్యదర్శి ఆసీఫ్ అలీ, ఎస్‌వో శ్రీదేవి ఉన్నారు.

ఆసిఫాబాద్ సీఐగా రవీందర్

ఆసిఫాబాద్ అంబేద్కర్ చౌక్, అక్టోబర్ 23 : ఆసిఫాబాద్ టౌన్ నూతన సీఐగా బుద్దే రవీందర్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. అంతకుముందు జిల్లా పోలీస్ కార్యాలయంలో ఎస్పీ డీవీ శ్రీనివాస్‌రావును మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఇటీవల జరిగిన బదిలీల్లో ఇంటెలిజెన్స్ విభాగంలో సీఐ పనిచేసిన రవీందర్ ఆసిఫాబాద్‌కు వచ్చారు. ఇక్కడ విధులు నిర్వహిస్తున్న సీఐ సతీశ్ బదిలీ అయ్యారు.

కాగజ్‌నగర్ పట్టణంలో రాత్రి పెట్రోలింగ్

కాగజ్‌నగర్, అక్టోబర్ 23: ఎస్పీ డీవీ శ్రీనివాసరావు ఆదేశాల మేరకు కాగజ్‌నగర్ డీఎస్పీ రామానుజం ఆధ్వర్యంలో పట్టణ సీఐ శంకరయ్య, రూరల్ సీఐ శ్రీనివాస్, ఎస్ఐలు దీకొండ రమేశ్, అనిల్ పట్టణంలో మంగళవారం రాత్రి ప్రతీ గల్లీలో పెట్రోలింగ్ నిర్వహించారు. రాత్రిపూట నిర్వహిస్తున్న హోటళ్లకు వెళ్లి, మూసివేయాలని యజమానులను ఆదేశించారు. అనవసరంగా రోడ్లపై బైకులతో తిరుగుతున్నవారికి కౌన్సెలింగ్ నిర్వహించారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి

హాజీపూర్, అక్టోబర్ 23 : మండలంలోని వేంపల్లి వద్ద బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో పెద్దపల్లి జిల్లా అంతర్గాం మండలం మద్దిరాలకు చెందిన మాటేటి శంకర్ (39) మృతి చెందాడు. మాటేటి శంకర్, వెల్గటూర్ మండలం చెగ్యాం గ్రామానికి చెందిన నడిమెట్ల పోశం మంచిర్యాల నుంచి ఎల్లంపల్లి ప్రాజెక్టు మీదుగా వెళ్లేందుకు బైక్‌పై బయల్దేరారు. వేంపల్లి వద్ద మంచిర్యాల నుంచి లక్షెట్టిపేట వైపు వెళ్తున్న ఓ లారీ వెనుక నుంచి బైక్‌ను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో పోశం, శంకర్‌కు తీవ్రగాయాలయ్యాయి. వారిని మంచిర్యాల ప్రభుత్వ దవాఖానకు తరలించగా అప్పటికే శంకర్ మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. పోశం పరిస్థితి విషమంగా ఉండడంతో కరీంనగర్ తరలించారు. పోలీస్ స్టేషన్ ఫిర్యాదు అందలేదు.

క్వార్టర్ల కేటాయింపునకు కౌన్సెలింగ్

శ్రీరాంపూర్, అక్టోబర్ 23 : శ్రీరాంపూర్, నస్పూర్ కాలనీల్లో ఖాళీగా ఉన్న క్వార్టర్ల కేటాయింపునకు బుధవారం సీఈఆర్ క్లబ్‌లో కార్మికులకు కౌన్సెలింగ్ నిర్వహించారు. ఎస్‌వోటూ జీఎం సత్యనారాయణ, డీవైజీఎం అరవిందరావు, సివిల్ ఈఈ సత్యనారాయణ చేంజ్ ఆఫ్ క్వార్టర్‌కు దరఖాస్తు చేసుకున్న ఉద్యోగులకు కౌన్సెలింగ్ నిర్వహించి, కేటాయించారు. 290 క్వార్టర్లకు గాను, 532 మంది కార్మికులు దరఖాస్తు చేసుకున్నారు. 107 మంది ఉద్యోగులు చేంజ్ ఆఫ్ క్వార్టర్లు తీసుకుననట్లు తెలిపారు. డీవైపీఎం రాజేశ్, సీనియర్ పీవో కాంతారావు, సీనియర్ అసిస్టెంట్ లక్కాకుల శ్రీధర్ పాల్గొన్నారు.

విద్యార్థులపై శ్రద్ధ చూపాలి

లక్షెట్టిపేట, అక్టోబర్ 23 : విద్యార్థుల చదువుతో పాటు, ఆరోగ్యం విషయంలో వార్డెన్లు ప్రత్యేక శ్రద్ధచూపాలని జిల్లా దళిత అభివృద్ధి శాఖ ఉప సంచాలకుడు పోతు రవీందర్ రెడ్డి ఆదేశించారు. పట్టణంలోని ప్రభుత్వ వసతిగృహాలను బుధవారం ఆకస్మికంగా పరిశీలించారు. విద్యార్థులతో మాట్లాడి, సౌకర్యాలపై ఆరా తీశారు. వసతి గృహ సంక్షేమ అధికారి కిషోర్, రాజు, సునిత సిబ్బంది, ఉన్నారు.

రేచిని రోడ్ రైల్వేస్టేషన్ పరిశీలన

తాండూర్, అక్టోబర్ 23 : బెల్లంపల్లి రైల్వే డివిజన్ అధికారులు బుధవారం స్థానిక నాయకులతో కలిసి రేచిని రోడ్ రైల్వే స్టేషన్‌ను పరిశీలించారు. బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్, స్థానిక నాయకులు ఈ స్టేషన్ సమస్యల పరిష్కారం కోసం మంగళవారం జనరల్ మేనేజర్ అరుణ్ కుమార్ జైన్‌ను కలిసి వివరించారు. జీఎం ఆదేశాల మేరకు బెల్లంపల్లి ఏడీఎం గోపీ, ఇతర రైల్వే అధికారులు స్టేషన్‌కు వచ్చి, సమస్యలు పరిశీలించారు.

లెదర్ పార్కు ప్రారంభానికి కృషిచేయాలి

మందమర్రి, అక్టోబర్ 23 : మందమర్రి పట్టణంలో అసంపూర్తిగా ఉన్న లెదర్ పార్కును ప్రారంభించేందుకు ప్రజాప్రతినిధులు కృషిచేయాలని మాదిగ హక్కుల దండోరా(ఎంహెచ్‌డీ) రాష్ట్ర గౌరవాధ్యక్షుడు పెరుమండ్ల రామకృష్ణ డిమాండ్ చేశారు. బుధవారం ఎంహెచ్‌డీ రాష్ట్ర అధ్యక్షుడు రేగుంట సునీల్ ఆధ్వర్యంలో రాష్ట్ర బృందంతో కలసి పరిశీలించారు. రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ ఎలుకంగి జనార్దన్, జిల్లా అధ్యక్షుడు కడారి రమేశ్, రాష్ట్ర నాయకులు వడ్లూరి శ్రీనివాస్, కొలుగూరి విజయ్‌కుమార్, రాజం, కొమురయ్య, పురుషోత్తం, బిడునూరి శంకర్, దేవన్న, కుమారస్వామి, సమ్మయ్య తదితరులు పాల్గొన్నారు.

ప్రత్యేకాధికారి పర్యటన

పెంచికల్‌పేట్, అక్టోబర్ 23 : లోడ్పల్లి, కొండపల్లిల్లో బుధవారం మండల ప్రత్యేకాధికారి పర్యటించారు. లొడ్పల్లిలోని ట్రైబల్ వెల్ఫేర్ పాఠశాలను సందర్శించి, అభ్యాసనా సామర్థ్యాలను పరిశీలించారు. సమస్యలు తెలుసుకున్నారు. గ్రామాల్లో శానిటేషన్, తాగునీటి సరఫరాను పరిశీలించారు. కొత్తవాడలో మినీ అంగన్‌వాడీ కేంద్రం కావాలని గ్రామస్తులు కోరారు. కొండపల్లి పాఠశాలలో మరుగుదొడ్లు నిర్మించాలని, తాగునీటి మోటార్‌కు మరమ్మతులు చేయాలని ఆయన దృష్టికి తీసుకెళ్లారు. ఎంపీడీవో ఆల్బర్ట్, ఎంఈవో రమేశ్ బాబు, కార్యదర్శులు, ఉపాధిహామీ సిబ్బంది, అధికారులు పాల్గొన్నారు.

దొంగతనం చేస్తూ విద్యుదాఘాతానికి గురై..

హాజీపూర్, అక్టోబర్ 23 : ముల్కల్ల గ్రామంలోని గంగపుత్ర కాలనీకి చెందిన గోలివాడ చంద్రయ్య దొంగతనం చేస్తూ విద్యుదాఘాతానికి బలయ్యాడు. వివరాల్లోకి వెళితే.. ముల్కల్ల శివారులోని ఓ జిన్నింగ్ మిల్లు మూతపడడంతో 33/11 కేవీ నుంచి ఉన్న విద్యుత్ సరఫరాను గతంలోనే నిలిపి వేశారు. కాగా, చంద్రయ్య మంగళవారం విద్యుత్ సరఫరా లేని అల్యూమినియం తీగలను దొంగిలించేందుకు వెళ్లాడు. తీగను కట్ చేసి, చుట్టచుడుతున్న క్రమంలో విద్యుత్ సరఫరా ఉన్న వైరుకు తగిలి విద్యుదాఘాతానికి గురయ్యాడు. దీంతో శరీరం మొత్తం కాలిపోయి, ఆ మంటలతోనే రోడ్డువరకు వచ్చి పడిపోయాడు. స్థానికులు గమనించి, ప్రభుత్వ దవాఖానకు తరలించారు. హాజీపూర్ పోలీసులు, విద్యుత్ శాఖ అధికారులు, సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకొని విచారణ చేపట్టగా, అక్కడ దొంగతనం జరిగినట్లు గుర్తించారు. చంద్రయ్య వాహనం, వైర్ కట్ చేసేందుకు ఉపయోగించిన వస్తువులు లభించగా, పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఈ విషయంపై గురువారం హాజీపూర్ ఎస్ఐకి ఫిర్యాధు చేయనున్నట్లు ఏఈ మహేందర్ రెడ్డి తెలిపారు.

రైతులు సస్యరక్షణ పద్ధతులు పాటించాలి

తాండూర్, అక్టోబర్ 23 : వ్యవసాయాధికారులు తెలియజేసే సస్యరక్షణ పద్ధతులు పాటించి, పంటలను కాపాడుకోవాలని మంచిర్యాల జిల్లా వ్యవసాయాధికారి కల్పన రైతులకు సూచించారు. మండలంలోని రేచిని గ్రామపంచాయతీ పరిధి అన్నారం గ్రామంలో బుధవారం క్షేత్రస్థాయిలో వరి, పత్తి పంటలను ఏఈవోలతో కలిసి పరిశీలించారు. ప్రస్తుతం వరిలో ఎండాకు తెగులు, కంకి నల్లి ఉధృతి ఎక్కువ ఉన్నట్లు గుర్తించారు. వాటి నివారణకు ప్రోపర్‌గైట్-57 ఈసీ 2ఎంఎల్, ప్రాపికోనజోల్-25 1 ఎంఎల్ లీటరు నీటికి కలిపి పిచికారీ చేసుకోవాలని సూచించారు. కాటుక తెగులు, పసుపు ముద్ద తెగులు రాకుండా ప్రొపికోనజోల్-25 ఈసీ 1 ఎంఎల్ లీటరు నీటికి కలిపి పిచికారీ చేసుకోవాలని తెలిపారు. వరి, పత్తిలో చీడపీడల గురించి సలహాలు, సూచనలు ఇచ్చారు. ఏఈవోలు యూ శంకర్, వీవీ ధనలక్ష్మి, రైతులు ఉన్నారు.

కుమ్రం భీం జయంతి

కౌటాల, అక్టోబర్ 23 : కౌటాల మండల కేంద్రంలో బుధవారం కుమ్రం భీం జయంతిని ఘనంగా నిర్వహించారు. ఆదివాసీ నాయకులు భీం విగ్రహానికి పూల మాలలు వేసి, నివాళులర్పించారు. జల్ జంగల్ జమీన్ నినాదంతో అలుపెరుగని పోరాటం చేసిన వీరుడు కుమ్రం భీం అని రాజ్‌గోండ్ సేవా సమితి జిల్లా అధ్యక్షుడు, డీసీఎంఎస్ వైస్ చైర్మన్ కుమ్రం మాంతయ్య పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఆదివాసీ నాయకులు, ఆదివాసీ ఉద్యోగులు, పలువురు మాజీ ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

హామీలను నెరవేర్చాలి

దహెగాం, అక్టోబర్ 23 : ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను ప్రభుత్వం నెరవేర్చాలని బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో బుధవారం తహసీల్ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి 10 నెలలు గడుస్తున్నా హామీలను అమలు పర్చడంలేదని, రైతులకు పూర్తిస్థాయిలో రుణమాఫీ చేయలేదని ఆరోపించారు. బీఆర్ఎస్ పార్టీ మండల కన్వీనర్ షాకీర్, నాయకులు ఎల్కరి ప్రశాంత్, తనుకు నారాయణ, ఎస్‌కే బాబు, కామెర తిరుపతి పాల్గొన్నారు.

కర్ర లారీలకు జరిమానా

కాగజ్‌నగర్, అక్టోబర్ 23 : కాగజ్‌నగర్ రూరల్ పోలీసు స్టేషన్ సమీపంలో వాహనాల తనిఖీ చేపట్టి, పలు లారీలకు జరిమానా విధించినట్లు రూరల్ ఎస్ఐ మహేందర్ తెలిపారు. వంజీరి చెక్‌పోస్టు సమీపంలో వివిధ ప్రాంతాల నుంచి జేకే మిల్లుకు కర్ర తీసుకొచ్చే లారీలు నిబంధనలు పాటించకపోవడంతో జరిమానా విధించినట్లు స్పష్టం చేశారు. అక్కడికి చేరుకున్న లారీ అసోసియేషన్ ప్రతినిధులు, జేకే పేపర్ మిల్లు ప్రతినిధులకు వాగ్వాదం జరిగింది. లారీ అసోసియేషన్‌కు సంబంధించిన పలు సమస్యలు పరిష్కరించాలని కర్ర లారీ కింద లారీ అసోసియేషన్ అధ్యక్షుడు కిషోర్ దూరాడు. పోలీసులు సముదాయించి ఇరు వర్గాలకు నచ్చజెప్పడంతో వివాదం సద్దుమనిగింది.